క్లుప్తంగా

నేడు మెగా జాబ్ మేళా

పీలేరు రూరల్ : స్థానిక సంజయ్‌గాంధీ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో మంగళవారం మెగా జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ సుధాకర్‌రెడ్డి తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ మంగళవారం ఉదయం 9 గంటల నుంచి జరిగే జాబ్ మేళాకు అపోలో ఫార్మసి, ఫ్యూచర్ టెక్ టాలెంట్ ఎడ్జ్, ముత్తూట్ ఫైనాన్స్, ఐసీసీ బ్యాంక్ కంపెనీలు హాజరవుతాయని తెలిపారు. నిరుద్యోగ యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. వివరాలకు 7799587687 నెంబర్‌ను సంప్రదించాలని కోరారు.

హుండీ ఆదాయం లెక్కింపు

మదనపల్లె సిటీ: మదనపల్లె పట్టణం దేవళంవీధిలోని శ్రీ ప్రసన్న వెంకటరమణస్వామి ఆలయం, సోమేశ్వరస్వామి ఆలయాల్లో సోమవారం హుండీ ఆదాయాన్ని లెక్కించారు. వెంకటరమణస్వామి ఆలయంలో రూ.2,30,630, సోమేశ్వరస్వామి ఆలయంలో రూ.1,21,360 ఆదాయం వచ్చినట్లు దేవదాయశాఖ ఈఓ రమణ తెలిపారు.

అప్రంటీస్‌కు 10 మంది ఎంపిక

తంబళ్లపల్లె: స్థానిక వెంకటసుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో సోమవారం అప్రంటీస్ మేళా నిర్వహించారు. శ్రీసిటీ ఇండాస్ కాపీ కంపెనీ ప్రతినిధి బాలకుమార్ ఆధ్వర్యంలో ఐటీఐ పూర్తి చేసిన 10 మందిని అప్రంటీస్‌కు ఎంపిక చేశారు. అప్రంటీస్‌పూర్తి చేసిన వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందన్నారు. అలాగే స్కిల్‌హబ్ ద్వారా శిక్షణ పొందిన 27 మంది విద్యార్థులకు డీఎస్‌డీవో హరిక్రిష్ణ, ప్రిన్సిపల్ శేషారెడ్డిలు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు.

నేడు ప్రత్యేక విద్యుత్ అదాలత్

మదనపల్లె : ఏపీఎస్పీడీసీఎల్ ఆధ్వర్యంలో విద్యుత్ వినియోగదారుల సమస్యలకు సంబంధించి మదనపల్లె సీటీఎం రోడ్డులోని డివిజన్ ఆఫీస్ ప్రాంగణంలో మంగళవారం ప్రత్యేక విద్యుత్ అదాలత్ నిర్వహిస్తున్నట్లు ఈఈ ఎస్ రాజశేఖర్‌రెడ్డి తెలిపారు. ఈ మేరకు సోమవారం ఈఈ కార్యాలయం నుంచి ఒక ప్రకటన విడుదల చేశారు. మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు ఆంధ్రప్రదేశ్ దక్షిణ ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ అధ్యక్షులు, ఇన్‌చార్జ్, ఆర్థికసభ్యులు కె.రామమోహన్‌రావు, సాంకేతికసభ్యులు ఎల్.అంజనీకుమార్, స్వతంత్ర్యసభ్యులు జి.ఈశ్వరమ్మ తదితరులు ప్రత్యేక విద్యుత్ అదాలత్‌కు ముఖ్యఅతిథులుగా హాజరవుతారన్నారు. మదనపల్లె డివిజన్ పరిధిలోని బి.కొత్తకోట, పీటీఎం, ములకలచెరువు, తంబళ్లపల్లె, పెద్దమండ్యం, కురబలకోట, నిమ్మనపల్లె, మదనపల్లె రూరల్, అర్బన్, రామసముద్రం మండలాలకు సంబంధించి విద్యుత్ వినియోగదారులు తమ సమస్యలను పరిష్కరించుకోవాల్సిందిగా ఈఈ రాజశేఖర్‌రెడ్డి కోరారు.

పంట నష్టం వివరాలు నమోదు చేయండి

గుర్రంకొండ: అకాల వర్షాలకు దెబ్బతిన్న పంటల నష్ట వివరాలను నమోదు చేయాలని వాల్మీకిపురం క్లస్టర్ ఉద్యానవనశాఖాధికారి ప్రసన్నలక్ష్మీ అన్నారు. సోమవారం ఆమె మండలంలోని గుర్రంకొండ, మర్రిమాకులపల్లె, అమిలేపల్లె, రామాపురం,టి.రాచపల్లె గ్రామాల్లో పర్యటించారు. రైతులు, ఆర్బీకే సిబ్బందితో కలసి వర్షాలకు దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. మామిడి తోటలు, టమాటా, కూరగాయాలు, పండ్లతోటలను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ దెబ్బతిన్న పంటల వివరాలు మొత్తం నమోదు చేయాలన్నారు. పంట నష్టపోయిన ప్రతి రైతుకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకొంటామన్నారు. ఆర్బీకే సిబ్బంది నవాజ్, షాబాజ్, మోగిత, నాయక్‌లు పాల్గొన్నారు.

వారపుసంత వేలం

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట వారపు సంతకు వేలం నిర్వహించడం ద్వారా పంచాయతీకి రూ. 3.60 లక్షల ఆదాయం వచ్చినట్లు ఈవోపీఆర్‌డీ లతీఫ్‌ఖాన్ తెలిపారు. సోమవారం నిర్వహించిన వేలం పాటలో గర్నిమిట్ట వారపు సంతకు ఏడాదిపాటు గేటు వసూళ్ల హక్కును రాములవారిపల్లెకు చెందిన కంభం రమణారెడ్డి దక్కించుకున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ సర్పంచ్ రమణమ్మ, కార్యదర్శి సిగ్బతుల్లా తదితరులు పాల్గొన్నారు.

11 మంది టీడీపీ నాయకుల బైండోవర్

ములకలచెరువు: మండలంలోని 11 మంది టీడీపీ కార్యకర్తలపై బైండోవర్ కేసు నమోదు చేసినట్లు ఏఎస్ఐ నజీర్ సోమవారం పేర్కొన్నారు. ఏఎస్ఐ కథనం మేరకు టీడీపీ మండలాధ్యక్షుడు సిద్దతో పాటు మరో 10 మంది ఆయన అనుచరులు ములకలచెరువు బస్టాండ్‌లో గొడవలకు ప్రేరేపించే విధంగా వ్యాఖ్యలు చేస్తుండగా సిబ్బందితో వెళ్ళి అడ్డుకున్నామన్నారు. అనంతరం వారిపై బైండోవర్ కేసు నమోదు చేసి తహసీల్దార్ శ్రీనివాసులు ఎదుట హాజరు పరచి సొంత పూచీకత్తుపై విడుదల చేశామన్నారు. పోలీసుల అనుమతులు లేకుండా ఎలాంటి సభలు, సమావేశాలు నిర్వహించరాదని ఆయన స్పష్టం చేశారు.

అక్రమ నిర్మాణాలు తొలగింపు

పీలేరు రూరల్ : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలోని సర్వే నెంబరు 30లో చెరువు పొరంబోకు స్థలంలో చేపడుతున్న ఆక్రమ నిర్మాణాలపై అధికారులు స్పందించారు. సోమవారం రెవెన్యూ అధికారులు సంఘటనా స్థలానికి చేరుకుని అక్రమ నిర్మాణాలు తొలగించారు. ఇది ప్రభుత్వ భూమి అని హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు. ప్రభుత్వ భూములను, స్థలాలను కబ్జా చేస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యం

– ఆర్డీఓ ఎం.ఎస్.మురళి



స్పందనలో ప్రజల సమస్యలు తెలుసుకుంటున్న ఆర్డీఓ ఎం.ఎస్.మురళి

మదనపల్లె : ప్రజాసమస్యల పరిష్కారమే స్పందన లక్ష్యమని, ప్రజలు సమర్పించే ఫిర్యాదులను సంబంధిత అధికారులు సత్వరమే పరిష్కరించేందుకు కృషి చేయాలని ఆర్డీఓ ఎం.ఎస్.మురళి అన్నారు. సోమవారం సబ్ కలెక్టరేట్‌లో నిర్వహించిన స్పందనలో మదనపల్లె రెవెన్యూ డివిజన్ పరిధిలోని తంబళ్లపల్లె, మదనపల్లె నియోజకవర్గాలకు చెందిన పలువురు తమ సమస్యలపై ఆర్డీఓకు అర్జీలను అందజేశారు. పట్టణంలోని రెడ్డెప్పనాయుడు కాలనీలో రోడ్డుకు అడ్డుగా వేసిన మట్టిని తొలగించి, నూతనంగా రోడ్డువేయాలని, మురికి కాలువలు నిర్మించాలని కాలనీవాసులు ఆర్.వసుంధరమ్మ, వై.సోమశేఖర్, జి.అరుణకుమారి తదితరులు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వం మంజూరు చేసిన డీకేటీ పట్టాకు సంబంధించి స్థలాన్ని సర్వే చేసి చూపాల్సిందిగా సర్వేయర్‌కు చలానా కట్టినా ఇప్పటివరకు సర్వే నిర్వహించలేదని, తన స్థలాన్ని సర్వే నిర్వహించి తనకు స్వాధీనపరచాల్సిందిగా శివాజీనగర్‌కు చెందిన కందుకూరి సుబ్రహ్మణ్యం ఫిర్యాదు చేశారు. పీటీఎం మండలానికి చెందిన యువతి కర్నూలుజిల్లాకు చెందిన ఓ యువకుడు తనను ప్రేమపేరుతో వేధిస్తున్నాడని, తనకు రక్షణ కల్పించాలని ఆర్డీఓకు అర్జీ సమర్పించింది. స్పందించిన ఆర్డీఓ వెంటనే బాధితురాలిని పట్టణంలోని దిశ పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయాల్సిందిగా సూచించారు. మున్సిపాలిటీలో జరిగిన స్పందనలో చైర్‌పర్సన్ మనూజారెడ్డి, కమిషనర్ ప్రమీల ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రశాంత్‌నగర్ ఆరోక్రాస్‌లో మురికికాలువలు పాడైపోవడంతో మురుగునీరు రోడ్డుపై ప్రవహిస్తోందని కాలనీవాసులు ఫిర్యాదుచేశారు. కృష్ణానగర్ రెండోక్రాస్‌లో, ఇందిరానగర్‌లో మెకానిక్ షెడ్ వద్ద మురుగుకాలువలపై బండలు వేయడంతో మురుగు తొలగించేందుకు కష్టంగా ఉన్నదని అర్జీ సమర్పించారు. రెడ్డెప్ప కాలనీలో వీధిలైట్లు వెలగడం లేదని, పట్టణంలో కుక్కల సమస్య అధికంగా ఉన్నదని ఫిర్యాదులు అందాయి. వీటిని సత్వరమే పరిష్కరించాల్సిందిగా మున్సిపల్ సిబ్బందిని చైర్‌పర్సన్, కమిషనర్ ఆదేశించారు.

రేషన్ బియ్యం ఇవ్వడంలేదని ఫిర్యాదు

గుర్రంకొండ: పట్టణంలో రేషన్‌బియ్యం ఇవ్వడం లేదంటూ గ్రామస్తులు తహసీల్దార్ ఖాజాబీకి స్పందన కార్యక్రమంలో ఫిర్యాదు చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామంలో మూడు చౌకదుకాణాలు ఉన్నాయన్నారు. గత రెండు నెలలుగా ఎండీయూ ఆపరేటర్లు రేషన్‌బియ్యంతో పాటు సరుకులు సక్రమంగా ఇవ్వడం లేదన్నారు. ఈనెల కోటాకు సంబంధించి ఇందిర్మకాలనీతో పాటు పట్టణంలోని పలు ప్రాంతాల్లో ఇంతవరకు రేషన్ సరుకులు పంపిణీ చేయలేదన్నారు. కొంతమంది డీలర్లు రేషన్ బియ్యంకు బదులు డబ్బులు ఇస్తున్నారని ఫిర్యాదు చేశారు. సందించిన తహసీల్దార్ ఎండీయూ ఆపరేటర్లను కార్యాలయానికి పిలిపించి విచారించారు. తమకు డీలర్లు రేషన్ సరుకులు, బియ్యం సక్రమంగా ఇవ్వడం లేదని దీంతో తాము పంపిణీ చేయలేక పోతున్నామని వారు పేర్కొన్నారు. వాల్మీకిపురం సివిల్ సప్లయ్స్ డీటీ వెంకట్‌రెడ్డికి కాల్‌చేసి వెంటనే పట్టణంలోని చౌకదుకాణాల్లో తనిఖీలు చేపట్టాలని ఆదేశించారు. ఈసంఘటనపై పూర్తి స్థాయిలో విచారజరిపించి బాధ్యులైన వారిపై చట్టపరంగా చర్యలు తీసుకొంటామన్నారు.



తహసీల్దార్ ఖాజాబీకి ఫిర్యాదు చేస్తున్న గ్రామస్తులు

‘రైతులను ప్రభుత్వం ఆదుకుంటుంది’

కలకడ : అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులను పంటల బీమా ద్వారా ప్రభుత్వం ఆదుకుంటుందని ఎంపీపీ శ్రీదేవి, హార్టికల్చర్ అధికారి సుకుమార్ అన్నారు. సోమవారం మండలంలోని కోన, దేవులపల్లె పంచాయతీలలో పర్యటించి పంటలను నష్టపోయిన రైతులను కలసి వారి పెట్టుబడులు, నష్టాలను విని, తిరిగి పంటలను కాపాడుకోవడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలియజేశారు. ప్రతి రైతు పంట సాగును ఈక్రాప్‌ద్వారా నమోదు చేసుకుంటే, ప్రభుత్వం ఉచితంగా బీమా చేయిస్తుందని గుర్తు చేశారు. మండలంలోని ప్రతి రైతు వారు సాగుచేసే ప్రతి పంటను స్థానిక రైతుభరోసా కేంద్రం వద్ద ఈక్రాప్ నమోదు, పంట బీమాను విధిగా చేయించుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈఓలు అక్రంబాషా,, శివ, వైఎస్సార్‌సీపీ నాయకులు మధుసూదన్‌రెడ్డి, గోవర్ధన్, అన్నయ్య పాల్గొన్నారు.



దెబ్బతిన్న పంటలను పరిశీలిస్తున్న ఎంపీపీ శ్రీదేవి

ఉచిత వసతి తోపాటు ప్రతి రోజూ సెహరి, ఇఫ్తారి

పీలేరు రూరల్ : పవిత్ర రంజాన్ మాసంలో ఉపవాసం ఉండే ముస్లిం సోదరులకు ఉచిత వసతి తోపాటు ప్రతి ఒరోజూ సెహరి, ఇఫ్తారి అందించనున్నట్లు వైఎస్సార్‌సీపీ నాయకులు అతికా షఫీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పీలేరు, కలికిరి, వాల్మీకిపురం, కేవీపల్లె, గుర్రంకొండ, కలకడ, రొంపిచెర్ల, పులిచెర్ల, కల్లూరు తదితర ప్రాంతాలకు చెందిన ముస్లిం సోదరులు ఉపవాసం స్థానిక ఆక్షా మసీదులో ప్రార్థనలు చేసుకోవడానికి ఏర్పాట్లు చేసినట్లు చెప్పారు. ఇక్కడ ఉండే వారికి 30 రోజుల పాటు వసతి, గురువుల పర్యవేక్షణలో ఖురాన్, నమాజ్, ఇస్లామ్‌లో అవసరమైన అంశాలు నేర్పించనున్నట్లు తెలిపారు. ముస్లిం సోదరులు సద్వినియోగం చేసుకోవాలన్నారు. వివరాలకు 9492378754 నెంబర్‌ను సంప్రదించాలని తెలియజేశారు.

పాఠశాలకు విద్యార్థులు షూ ధరించి రావాలి

– సీఎంఓ కరుణాకర్

పీలేరు : విద్యార్థులు విధిగా షూ ధరించి పాఠశాలకు రావాలని సమగ్ర శిక్ష జిల్లా కమ్యూనిటీ మొబలైజేషన్ అధికారి (సీఎంఓ) కరుణాకర్ అన్నారు. ఈ నెల 18న విద్యాశాఖ ముఖ్యకార్యదర్శి పాఠశాలను తనిఖీ చేసిన సమయంలో చాలా మంది విద్యార్థులు యూనిఫాం, షూ ధరించకపోవడంపై అయన ఆగ్రహం వ్యక్తం చేసిన విషయం విదితమే. సమగ్ర నివేదిక కోరినే నేపథ్యంలో సోమవారం స్థానిక జెడ్పీ ఉన్నత పాఠశాల మెయిన్‌ను సందర్శించారు. విద్యార్థులతో ముఖాముఖి నిర్వహించారు. విద్యార్థులు ప్రతి రోజూ యూనిఫాం, షూ ధరించి రావాలన్నారు. దీనిపై ఉపాధ్యాయులు దృష్టి సారించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ బాలాజీ నాయక్, హెచ్ఎం ఫ్యారూఖాన్, సీఆర్‌పీ మురళీధర్‌రాజు పాల్గొన్నారు.



విద్యార్థులతో మాట్లాడుతున్న సీఎంఓ కరుణాకర్

తృణధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం

వాల్మీకిపురం: తృణధాన్యాలతో మెరుగైన ఆరోగ్యం సాధ్యమని ఎంపీడీఓ షబ్బీర్ అహ్మద్ అన్నారు. సోమవారం స్థానిక ఐసీడీఎస్ కార్యాలయ ఆవరణంలో పోషణ్ పక్వాడ కార్యక్రమాన్ని జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించారు. సమావేశానికి హాజరైన గుర్రంకొండ, కలికిరి, కలకడ, వాల్మీకిపురం అంగన్‌వాడీ సిబ్బందిని ఉద్దేశించి సీడీపీఓ భారతి మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో సంప్రదాయ ఆహారాలకంటే గతంలో మన పెద్దలు వాడిన తృణధాన్యాల ఆహారం ఎంతో ఆరోగ్యకరమన్నారు. ఇందులో మంచి శక్తి, పోషకాలు ఉన్నాయన్నారు. ప్రాజెక్టు పరిధిలోని ప్రతి పంచాయతీ స్థాయిలో పోషణ్ పక్వాడ కార్యక్రమం నిర్వహించి, తృణధాన్యాల ప్రాధాన్యత, ప్రయోజనాలపై అవగాహన కల్పించడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో సూపర్‌వైజర్లు రోహిణి కుమారి, రాణి, మహాలక్ష్మి, సుశీల, యశోదమ్మ, అంగన్‌వాడీలు తదితరులు పాల్గొన్నారు.

నోటి శుభ్రతపై అవగాహన అవసరం

మదనపల్లె : నోటి శుభ్రత, జబ్బులపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలని ప్రభుత్వ జిల్లా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్.పద్మాంజలి దేవి, దంతవైద్యురాలు అఫ్షానాబేగం అన్నారు. సోమవారం వరల్డ్ ఓరల్ హెల్త్ దినోత్సవం సందర్భంగా ఆస్పత్రిలోని దంతవిభాగం వద్ద సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. శరీరంలో రోగాల వ్యాప్తికి నోరు ప్రధాన కారణమవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ ఉదయం, రాత్రి రెండుపూటలా బ్రష్ చేసుకోవాలన్నారు. మత్తుపదార్థాలు, సిగరెట్, బీడీ, గుట్కా, పొగాకు తదితర వాటికి దూరంగా ఉండాలన్నారు. ఆస్పత్రికి వచ్చిన రోగులకు ఉచితంగా బ్రష్, టూత్ పేస్ట్‌లను పంపిణీ చేశారు. అనంతరం దంత పరిశుభ్రతపై పట్టణంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో ఆర్ఎంఓ దివాకర్, సీనియర్ వైద్యులు రామమూర్తినాయక్, ఆంజనేయులు, పాల్‌రవికుమార్, ప్రసాద్‌రాజు, దంతవైద్యులు దుర్గాదేవి, పద్మావతి, రిషిత, హిమశైలజ, సంపూర్ణ పాల్గొన్నారు.

నోటి శుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత

వాల్మీకిపురం: నోటి శుభ్రతతోనే ఆరోగ్యానికి భద్రత ఉంటుందని స్థానిక ప్రభుత్వాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ఫైరోజా బేగం అన్నారు. ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా సోమవారం స్థానిక ప్రభుత్వాసుపత్రి నుంచి గాంధీ బస్టాండ్ వరకు ర్యాలీ నిర్వహించి, ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మత్తు పదార్థాల వాడకం వలన ఆరోగ్యం నాశనం అవ్వడంతో పాటు నోటి క్యాన్సర్లు వచ్చే అవకాశాలున్నాయన్నారు. మత్తుపదార్థాల వాడకం వలన కలిగే నష్టాలపై ప్రజలకు కరపత్రాలు పంపిణీ చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో పిజిస్వామి, సనా అయేషా, హర్షిత రెడ్డి, సిబ్బంది బాబా సాబ్, సుధాకర్, భాస్కర, నాగిరెడ్డి, ఎఎన్ఎంలు, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పీలేరు : నోటి శుభ్రత ఆరోగ్యానికి భద్రత అని దంతవైద్య నిపుణురాలు పుష్ప అన్నారు. సోమవారం ప్రపంచ నోటి ఆరోగ్య దినోత్సవం సందర్భంగా పీలేరు ప్రభుత్వాస్పత్రి నుంచి అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మన దంతాలను మనం కాపాడుకుంటే అవి మనలను కాపాడుతాయని తెలిపారు. దంత సమస్య కేవలం దంతానికే కాకుండా మొత్తం శరీర ఉనికికే ప్రమాదం వాటిల్లే ప్రమాదం ఉందని చెప్పారు. నోరు తడి ఆరిపోవడం, పంటి నొప్పి, దంతాలు రంగుమారడం, చిగుళ్ల నుంచి రక్తం కారుట లాంటి సమస్యలు గమనిస్తూ ఉండాలన్నారు. దురాల వాట్లకు దూరంగా ఉండాలన్నారు.



దంత పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తూ ర్యాలీ

మదనపల్లె వాసికి గేట్‌లో 47వ ర్యాంక్



సుదర్శన్ లిఖిత్‌రెడ్డి

మదనపల్లె : ఐఐటీ, ఎన్ఐటీ, ఐఐఎస్సీ తదితర ప్రతిష్ఠాత్మక సంస్థలో ఎం.టెక్‌లో ప్రవేశాలు, పబ్లిక్ సెక్టార్ కంపెనీల్లో ఉద్యోగాలకు నిర్వహించే గ్రాడ్యుయేట్ ఆప్టిట్యూడ్ టెస్ట్ ఇన్ ఇంజినీరింగ్(గేట్–2023)లో మదనపల్లెకు చెందిన మిట్టపల్లి సుదర్శన్ లిఖిత్ కెమికల్ ఇంజినీరింగ్ స్ట్రీమ్‌లో ఆల్‌ఇండియా 47వ ర్యాంక్ సాధించారు. పట్టణంలోని రెడ్డెప్పనాయుడు కాలనీకి చెందిన ఎం.ఎస్.లిఖిత్ ఇంటర్ వరకు మదనపల్లెలో చదివి, తిరుపతి ఎస్వీ యూనివర్సిటీ క్యాంపస్ ఇంజినీరింగ్ కళాశాల నుంచి 2018లో బీటెక్ టాపర్‌గా గోల్డ్‌మెడల్ పొందారు. ఐఐటీ బాంబేలో కెమికల్ ఇంజినీరింగ్‌లో ఎం.టెక్ పూర్తిచేశాడు. ఈనేపథ్యంలో గేట్–2023 టెస్ట్‌లో ఆల్ ఇండియా స్థాయిలో 47వ ర్యాంక్‌ను సాధించాడు.

ఆరుగురు జూదరుల అరెస్ట్

కలకడ : ఆరుగురు పేకాటరాయుళ్ళను అరెస్ట్ చేసి వారి వద్ద నుంచి రూ.15,770 నగదు, పేక ముక్కలు సీజ్ చేసినట్లు ఎస్ఐ తిప్పేస్వామి తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. సోమవారం మండలంలోని కోన పంచాయతీ తిప్పిగారిపల్లెకు దక్షణం వైపున పేకాట ఆడుతున్నట్లు అందిన సమాచారం మేరకు ఎస్ఐ తన సిబ్బంది శ్రీనివాసులు, రమేష్, కాంతారావ్, యోగేష్‌లతో కలసి దాడులు నిర్వహించారు. ఈ దాడిలో ఆరుగురు జూదరులను అదుపులోకి తీసుకుని వారిపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

పెద్దతిప్పసముద్రం: వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా సోమవారం స్థానిక మోడల్ స్కూల్‌లోని విద్యార్థులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటి వైద్య నిపుణులు డాక్టర్ మహదేవన్ వైద్య పరీక్షలు నిర్వహించారు. దృష్టి లోపం ఉన్న విద్యార్థులకు కంటి అద్దాలు కూడా అందజేస్తామని ఎంఈఓ నారాయణ, ప్రిన్సిపాల్ శివకుమారి పేర్కొన్నారు.

నేటి చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు

మదనపల్లె సిటీ: పట్టణంలోని నీరుగట్టువారిపల్లెలో వెలసిన చౌడేశ్వరిదేవి జ్యోతి ఉత్సవాలు మంగళవారం నుంచి ప్రారంభంకానున్నట్లు తొగటవీరక్షత్రియ సంఘం అధ్యక్షులు ఉప్పు రామచంద్ర తెలిపారు. బుధవారం ఉదయం మహిళలు అమ్మవారి జ్యోతులతో పెద్ద ఎత్తున ఊరేగించనున్నట్లు తెలిపారు.

పంచలోహ ఢమరుకం వితరణ

తంబళ్లపల్లె: తంబళ్లపల్లె సమీప మల్లయ్యకొండపై ఉన్న శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి కురబలకోట మండలం అడవిపల్లెకు చెందిన శివశంకర్‌రెడ్డి నిర్మలమ్మ కుటుంబ సభ్యులు కాశీపంచలోహ ఢమరుకాన్ని వితరణగా ఇచ్చారు. సోమవారం మల్లయ్యకొండకు భక్తులు పోటెత్తారు. పూజారులు ఈశ్వరప్ప, మల్లికార్జునలు స్వామివారికి ప్రత్యేక అలంకరణతో పూజలు, అభిషేకాలు నిర్వహించారు. భక్తులకు స్వామిదర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. గౌరమ్మకుట్టలో వెలసిన గౌరమ్మకు పూజలు చేశారు. కార్యక్రమంలో ఆయల ధర్మకర్తలు ప్రభాకర్‌రెడ్డి, సుదర్శన్‌రెడ్డి, సహదేవ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా మస్తాన్‌వలి దర్గా ఉరుసు



దర్గాలో ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే నవాజ్‌బాషా ,కడప పెద్ద దర్గా పీఠాధిపతి తదితరులు

మదనపల్లె సిటీ: స్థానిక కోటవీధిలోని మస్తాన్‌వలి దర్గా ఉరుసు ఉత్సవాల్లో భాగంగా సోమవారం గంధం ఉత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఉరుసును పురస్కరించుకుని దర్గాను రంగు రంగు విద్యుత్‌దీపాలతో అలంకరించారు. ఎమ్మెల్యే ఎం.నవాజ్‌బాషా దర్గాను సందర్శించి చాదర్‌ను సమర్పించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఉండాలని దువా చేశారు. కడప పెద్ద దర్గా పీఠాధిపతి అరీఫుల్లా హుస్సేని దర్గా ఉరుసు ఉత్సవాల్లో పాల్గొని చాదర్ సమర్పించారు. హిందూ,ముస్లిం సోదరులు దర్గాను దర్శించుకుని మొక్కులు తీర్చుకున్నారు. దర్గా కమిటీ అన్నదానం చేశారు. కార్యక్రమంలో దర్గా కమిటీ సభ్యులు ఇర్ఫాన్‌ఖాన్, రఫీక్‌అహ్మద్ పాల్గొన్నారు.

క్షయ రోగులకు పౌష్టికాహారం అందజేత



టీబీ రోగులకు పౌష్టికాహార కిట్లు అందచేస్తున్న జెడ్పీటీసీ సభ్యురాలు, వైద్యాధికారి

కలికిరి: పౌష్టికాహారం, విధిగా మందులు వాడకంతో క్షయ వ్యాధిని అధిగమించవచ్చని మండల వైద్యాధికారి చిన్నరెడ్డెప్ప అన్నారు. ప్రధానమంత్రి టిబి ముక్త భారత్ పోషణ మిత్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని మేడికుర్తి పీహెచ్‌సీ ఆవరణలో నిర్వహించిన కార్యక్రమంలో మండల జెడ్పీటీసీ సభ్యురాలు పద్మజ, పద్మావతి హెల్త్ అండ్ సర్వీసెస్ సొసైటి ఆధ్వర్యంలో టీబీ రోగులను పౌష్టికాహారం కిట్లు అందచేశారు. క్షయ నివారణకు ప్రభుత్వం కృషి చేస్తోందని, అలాగే పలు స్వచ్ఛంద సేవా సంస్థలు కూడా ముందుకు వచ్చి వ్యాధిగ్రస్తులను ఆదుకుంటున్నారన్నారు. వ్యాధి గ్రస్తులు ఆరు నెలల పాటు క్రమం తప్పకుండా మందులు, పౌష్టికాహారం తీసుకోవాలన్నారు. అనంతరం స్థానికులకు క్షయ వ్యాధి లక్షణాలు, నివారణ మార్గాలపై అవగాహన కల్పించారు. వ్యాధి గ్రస్తులను దత్తత తీసుకోవడానికి దాత, స్వచ్ఛంద సేవా సంస్థ ముందుకు రావడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యాధికారి కావ్యగంధ, సీహెచ్ఓ ఇందిరాదేవి, ఎంపీహెచ్ఎస్ హేమలత, మురళి, సూపర్వైజర్ నాగిరెడ్డి, స్టాఫ్‌నర్స్ ప్రమీలకుమారి, ఎల్‌టీ సందీప్, ఎంఎల్‌హెచ్‌పీలు క్రిష్ణకుమారి, నాగవేణి, చందుప్రియ, భానుప్రియ, షహీద, గీత, నాగరాణి, సాహెరభాను, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

భూ సమస్యను పరిష్కరించాలని నిరసన



నిరసన తెలుపుతున్న రాయంచెరువు వడ్డిపల్లె గ్రామస్తులు

మదనపల్లె : మండలంలోని పోతపోలు గ్రామంలోని సర్వేనెంబర్ 144/2, 143, 145కు సంబంధించిన భూములను పూర్వీకుల నుంచి వంశపారంపర్యంగా అనుభవం కలిగి ఉంటే, సంబంధం లేని వ్యక్తులు భూముల్లోకి అక్రమంగా ప్రవేశించి ఇబ్బందులకు గురిచేస్తున్నారని రాయంచెరువు వడ్డిపల్లెకు చెందిన గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. సోమవారం సబ్‌కలెక్టరేట్‌లో తమ భూసమస్యను పరిష్కరించాలని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భూములకు సంబంధించి గ్రామస్తుల మధ్య బేధాభిప్రాయాల కారణంగా ఎవరి భాగాలు వారికి కొలిచి ఇవ్వాల్సిందిగా సర్వే కోసం రెండుసార్లు చలానా కట్టామన్నారు. అయితే రెవెన్యూ అధికారులు సర్వే చేసి సబ్ డివిజన్ చేయకుండా ఆస్తిలో హక్కులేని వారి పేరుతో సబ్ డివిజన్ చేసి ఆన్‌లైన్ రికార్డులో నమోదుచేసినట్లు తమ దృష్టికి వచ్చిందన్నారు. ఈ విషయమై తహసీల్దార్, సర్వేయర్‌ను కలిసి పలుమార్లు విజ్ఞప్తి చేసినా ఎలాంటి ఫలితం లేదన్నారు. భూములకు సమీపంలో కొత్తగా మెడికల్ కళాశాల, బైపాస్‌రోడ్డు నిర్మాణాలు జరుగుతుండటంతో వాటిని ఆక్రమించుకునేందుకు పలువురు ప్రయత్నిస్తున్నారని, తమకు న్యాయం చేయాల్సిందిగా అధికారులను వేడుకున్నారు. కార్యక్రమంలో రెడ్డెప్ప, నరసింహులు, గంగులప్ప, చిన్నరెడ్డెప్ప, నారాయణ, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

రూ. 30 లక్షలతో తాగునీటి సమస్య పరిష్కారం



బోరు ప్రారంభిస్తున్న సర్పంచ్ హబీబ్‌బాషా

పీలేరు రూరల్ : స్థానిక తిరుపతి రోడ్డు మార్గంలో నాయీబ్రాహ్మణ, రజకులు, పారిశుధ్య కార్మికుల కాలనీలకు శాశ్వత ప్రాతిపదికన రూ. 30 లక్షలతో తాగునీటి సమస్య పరిష్కరించినట్లు సర్పంచ్ డాక్టర్ హబీబ్‌బాషా తెలిపారు. సోమవారం రెండు కొత్తస్కీంబోర్లకు పూజలు నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ పంచాయతీ నిధులతో రెండు బోర్లు, రెండు మోటార్లు, పైపులైన్లు ఏర్పాటు చేసి ప్రతి ఇంటికి స్వచ్ఛమైన తాగునీరు అందించామన్నారు. సుమారు 150 కుటుంబాలకు తాగునీటి సమస్య తీర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీటీసీ నరసింహారెడ్డి, వార్డు మెంబరు మల్లికార్జునరెడ్డి, నాయకులు ఆనంద్, వినోద్, చక్రధర్, ప్రదీప్‌కుమార్, మురళి, అంజి, జయరామ్, ఈవో రెడ్డిప్రసాద్‌రెడ్డి, శానిటరీ ఇన్స్‌పెక్టర్ రవికుమార్, వీఆర్వో యర్రయ్య, కార్యదర్శి నవీనా పాల్గొన్నారు.

సచివాలయాల్లో మెరుగైన సేవలు అందించండి

– డీఎల్‌డీఓ లక్ష్మీపతి



సామకోటవారిపల్లె సచివాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ లక్ష్మీపతి

నిమ్మనపల్లె : గ్రామ సచివాలయాల్లో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని మదనపల్లె డివిజన్ లెవల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్(డీఎల్‌డీఓ) లక్ష్మీపతి అన్నారు. సోమవారం మండలంలోని సామకోటవారిపల్లె, అగ్రహారం గ్రామసచివాలయాలను ఆకస్మికంగా తనిఖీ చేశారు. హాజరుపట్టికలు, రికార్డులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..ప్రభుత్వం అందజేస్తున్న సంక్షేమ పథకాలు అర్హులకు అందేలా సిబ్బంది పనిచేయాలన్నారు. ఉద్యోగులు సమయపాలన పాటించాలన్నారు. కచ్చితంగా యూనిఫాం ధరించడం, స్పందన కార్యక్రమాలు నిర్వహించడం చేయాలన్నారు. కార్యక్రమంలో ఎంపీడీఓ లీలామాధవి, సర్పంచ్ మహదేవరెడ్డి, పంచాయతీకార్యదర్శి మంజుల, నాగమల్లి తదితరులు పాల్గొన్నారు.

డంపింగ్ యార్డులను సుందరవనాలుగా తీర్చిదిద్దాలి



డంపింగ్ యార్డులను పరిశీలిస్తున్న డీపీఓ ధనలక్ష్మీ

గుర్రంకొండ: గ్రామాల్లో డంపింగ్ యార్డులను సుందరవనాలుగా తీర్చిదిద్దాలని డీపీఓ ధనలక్ష్మీ అన్నారు. సోమవారం మండలంలోని తరిగొండ గ్రామంలోని డంపింగ్ యార్డులను ఆమె పరిశీలించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుద్ధ్యంపై కార్యదర్శులు దృష్టి సారించాలన్నారు. ప్రస్తుత సీజన్‌లో వైరస్‌లో ఎక్కువగా ప్రబలే అవకాశమున్నందును ముందస్తు జాగ్రత్తలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్యంపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. డంపిగ్‌యార్డుల్లో ఎరువుల తయారీని ప్రారంభించాలన్నారు. యార్డుల్లో వానపాముల పెంపకంతో వర్మికంపోస్టు ఎరువులను ఉత్పత్తి పెంపొందించాలన్నారు. గ్రామాల్లో ఇంకా వినియోగంలోకి తానీ డంపింగ్ యార్డుల్లో వెంటనే పనులు పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో కార్యదర్శులు మణికుమార్, కల్యాణీ, ప్రమీలా, నిస్సార్‌లు పాల్గొన్నారు.

ఘనంగా గంగజాతర

కేవీపల్లె : మండలంలోని గర్నిమిట్ట కస్బా గంగజాతర ఘనంగా నిర్వహించారు. గ్రామ నడిబొడ్డున గంగమ్మ ప్రతిమను ఏర్పాటు చేసిన వివిధ రకాల పుష్పాలు, మామిడి, వేప తోరణాలతో అలంకరించారు. రాత్రి భక్తుల కాలక్షేపానికి ఆసాది కథ ఏర్పాటు చేశారు. సోమవారం తెల్లవారి జాము నుంచి అమ్మవారికి పెద్ద ఎత్తున బోణాలు సమర్పించి మొక్కుబడులు చెల్లించారు.